పేదల సంతోషం కోసమే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలం కొత్త రావిచర్లలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ఇంటింటికీ వెళ్లి ఏయే పథకాల ద్వారా లబ్ధిపొందారో ఆయా కుటుంబాల వారికి వివరించారు. అర్హులకు పథకాలు రాకపోతే వారి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోన్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. ప్రభుత్వానికి ప్రజల్లో లభిస్తోన్న ఆదరణ చూసి ఓర్వలేకే చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ప్రజల కోసం పనిచేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో కూడా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లావు నాగవరప్రసాద్, చెరుకూరి బ్రహ్మేశ్వరరావు, బొబ్బా సాంబశివరావు, శీలం ఏలియా, ఎంపీడీఓ ఎంపీఎస్ సుందరి, ఏపీఎం దయాల రాజశేఖర్, ట్రాన్స్‌కో ఏఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి అంకమ్మ తల్లి దేవర సంబరాలు

అయ్యంకి(మొవ్వ): మండల పరిధిలోని అయ్యంకి గ్రామంలో బుధవారం నుంచి ఐదు రోజుల పాటు శ్రీ అంకమ్మ తల్లి వారి దేవర సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం అమ్మవారి ఉట్టి దించడంతో సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. 27న కాటి శక్తుల ఆనకట్టుట, కపిరి కుండలో అన్నం వేయుట, 28న అంకగుడారం, మాత పెళ్లి, 29న మాత మైలు సుంకుచెరుగుట, పుట్ట దగ్గర పేగు చుట్టుకొనుట, గజాల కొలువు ఊరేగింపు, 30వ తేదీన మొక్కుబడులు, పొంగళ్ల కుంభ నైవేద్యం, రాత్రికి రేణుకా యుద్ధం తదితర భక్తి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆగిరిపల్లి: మండల పరిధిలోని చిన్న ఆగిరిపల్లి శివారు సింగన్నగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సాదం శివాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి పార్టీ తరఫున గ్రామ సర్పంచ్ పల్లగాని రమాదేవి జమదగ్ని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, నాయకులు చిన్ని రాంబాబు సేకరించిన రూ.50 వేలు అందజేశారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ప్రారంభం



మల్లేల(తిరువూరు): మండలంలోని మల్లేలలో జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల మంజూరు కార్యక్రమాన్ని సర్పంచ్ వంగూరి మరియమ్మ మంగళవారం ప్రారంభించారు. గ్రామంలో రక్షితమంచినీటి పథకం నుంచి అవసరమైన ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ కలకొండ రవికుమార్, ఎంపీటీసీ పల్లపు లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

తిరువూరు: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి తిరువూరు పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వసుధ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ దుబ్బాకు ఆనందరావు నగర పంచాయతీ కమిషనర్‌ను కోరారు. మంగళవారం ఈ మేరకు నగరపంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి వేసవిలో పట్టణ ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న నగర పంచాయతీ ఈ ఏడాది వీటిని ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

చాట్రాయి: రైతు భరోసా పథకానికి రైతులు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. పాసు బుక్, ఆధార్ జిరాక్సు కాపీలతో గ్రామంలోని రైత భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రబీ వరి కోతలు కోసిన రైతులు ఆర్‌బీకేలో లేదా పీఏసీలను సంప్రదించి తమ ధాన్యాన్ని ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఏ.కొండూరు: మండలంలోని గొల్లమందల, కంభంపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ జే రామారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీలో 7,200 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో కూలీలు ఉదయాన్నే ఆరు గంటలకే పనులకు వెళ్లాలని సూచించారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా అంతం



ముసునూరులో మలేరియాపై అవగాహన ర్యాలీ



నూజివీడు మండలం దిగవల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముసునూరు: మలేరియా వ్యాధిని అంతమొందించాలంటే దోమల నిర్మూలనకు కృషి చేయాలని వైద్యాధికారులు ఎం.కిరణ్‌కుమార్, ప్రతాప్, కరీముల్లా పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం ముసునూరు, రమణక్కపేట సీహెచ్‌సీల ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ మాట్లాడుతూ సంప్రదాయాలను పాటించడం, పరిశుభ్రతతో పాటు, మొక్కలు పెంచి మంచి గాలిని స్వీకరిస్తూ ఆనందంగా జీవించాలన్నారు. అనంతరం వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎం శ్రీనివాస్, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శి ప్రవంతి, మండల పరిషత్ సిబ్బంది సగ్గుర్తి శ్రీనివాస్, సన్నీ, ఉపాధ్యాయులు, సీహెచ్‌ఓ, ఎంపీహెచ్‌ఈఓలు, స్వరూప్, పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మలేరియాని నివారిద్దామని పీహెచ్‌సీ వైద్యాధికారి లీనా బెంజిమెన్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని చాట్రాయిలో నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ, ఆయా సెంటర్లలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ మురళీమోహనరావు, సీహెచ్‌ఓ రమణ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, రెవెన్యూ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

నూజివీడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మురుగనీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారానే మలేరియాను అదుపులో ఉంచవచ్చని దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని దిగవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో మలేరియాపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.

గొల్లపల్లిలో..

గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి పి.అనూష, ప్రత్యేకాధికారి ఇమ్మానియేలు, ఎంపీడీఓ ఎంపీఎస్ సుందరి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, పద్మావతి పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమం కొండపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిపారు. పీహెచ్‌సీ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డాక్టర్ శిరీషా, ప్రిన్సిపాల్ ఆర్.శైలజ పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆగిరిపల్లి మండల తహసీల్దార్ ఎం.ఉదయ్‌భాస్కరరావు, ఎంపీడీఓ కె.వాణి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అవగాహన ర్యాలీని ఆగిరిపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రత్నకుమార్, సీహెచ్‌ఓ లక్ష్మయ్య, ఆగిరిపల్లి, ఈదర, సగ్గూరు పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం, మురుగునీరు నిల్వ లేకుండా చేయడం వలన దోమలు ప్రబలకుండా ఉంటాయని మండల వైద్యాధికారి విజయలక్ష్మి అన్నారు. జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వేంకటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ ఏడుకొండలు, ఎంపీహెచ్‌ఎస్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా రెడ్డిగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డిగూడెం పీహెచ్‌సీ డాక్టర్ సందేష్ మాట్లాడుతూ మలేరియా రహిత సమాజం కోసం మనమంత పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వి.శ్యామ్‌సుందరరావు, లక్ష్మీ, భవానీ, హెల్త్ అసిస్టెంట్లు సురేష్, నాగేశ్వరరావు, ప్రతాప్ పాల్గొన్నారు.

నెమలి ఆలయ దుకాణాల వేలం

గంపలగూడెం: నెమలి వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని దుకాణాల అద్దె వేలం పాట మంగళవారం జరిగింది. మొత్తం 18 దుకాణాలకు వేలంపాట నిర్వహించగా రూ.1,06,700 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. మూడు సంవత్సరాల కాలవ్యవధికి ఈ పాటలు నిర్వహించామని పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కావూరి శిరీష పాల్గొన్నారు.

సమావేశాలకు రానివారిపై చర్యలు



జి.కొండూరు: సరైనా కారణం లేకుండా మండల పరిషత్ సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కాగా గత కొన్ని సమావేశాల నుంచి అధికారులు కొంతమంది ఈ సమావేశాలకు హాజరుకాకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిపి వాటిని పరిష్కరించాలంటే ప్రజా ప్రతినిధులతో పాటు అధికారుల పాత్ర కూడా కీలకమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, ఎంపీడీఓ అనురాధ పాల్గొన్నారు.

30 నుంచి యోగా శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆవరణలోని తమ అసోసియేషన్ హాల్లో ఈ నెల 30వ తేదీ నుంచి నెల రోజుల పాటు యోగాలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనులు ప్రారంభం



డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పరిసరాల శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని జాకీర్‌హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహబాష అన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శ్రామికనగర్‌లో పారిశుద్ధ్యం పనులు మంగళవారం ఆయన ప్రారంభించారు. 26వ వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు జాఫర్‌సాదిక్, మస్తాన్‌వలి, నాగుల్ మీరా, హైకోర్టు న్యాయవాది సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా



మొబైల్ కోర్టు నిర్వహిస్తున్న న్యాయమూర్తి రామమోహన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీఎంసీ సర్కిల్–1 కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి యు.రామమోహన్ మంగళవారం మొబైల్ కోర్టును నిర్వహించారు. సర్కిల్–1 కార్యాలయ పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై వివిధ డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 20 కేసులకు సంబంధించిన వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఆయా కేసుల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వ్యక్తులు, పశువులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలివేసే వారు, రోడ్లపై చెత్త వేసేవారికి న్యాయమూర్తి రామమోహన్ రూ.12,260 జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా మరోసారి వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడానికి శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు ప్రతి రోజూ ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించే షాపులను తనిఖీ చేయాలని, అందరూ విధిగా ప్లాస్టిక్ బ్యాన్‌ను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు ఓబేశ్వరరావు, శివరామప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లించి రాయితీ పొందండి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాలకు ముందస్తు పన్ను చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న 5 శాతం రాయితీని పొందాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నగరవాసులకు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అంకబాబు

ఆగిరిపల్లి: గ్రామాల్లో మహిళా పోలీసులు విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 19 సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులు గ్రామాల్లో జరిగే సంఘటనలపై నిఘా ఉంచాలని సీఐ అన్నారు. వివాదాలు జరిగిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి ముందస్తుగానే సమాచారాన్ని సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఎస్సై చంటిబాబు, ఏఎస్ఐ నాయక్ పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులు నింపాలి

మైలవరం: నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వేసవిలో తిరువూరు, మైలవరం, నందిగామ, నూజివీడు, గన్నవరం నియోజకవర్గాలలోని మేజర్ కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపాలని బీజేపీ కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1985 నుంచి నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా వేసవిలో నీరు విడుదల చేయడం వలన పశువులకు, మంచినీటికి, భూగర్భ జలాలు ఇంకిపోకుండా మెట్ట ప్రాంతాల నియోజకవర్గాలలో వేసవి కాలంలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సాగర్‌నీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీ వెంకటేశ్వరరావు, నాయకులు జే శేఖర్, నరేంద్ర, మట్టా రామారావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆరోగ్య సంరక్షణ చర్యలు

దాములూరు(ఇబ్రహీంపట్నం): మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కూలీల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఏపీఓ మాదవరెడ్డి అన్నారు. మండలంలోని దాములూరు, కొటికలపూడి గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీల శక్తిని పెంచేందుకు ఫీల్డ్‌అసిస్టెంట్ల సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు మంగళవారం పంపిణీ చేశారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని, ప్రతి గడపకూ సంక్షేమపథకాలు అందుతున్నాయని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మంగళవారం తిరువూరు 17వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రక్షణనిధి వార్డులో పర్యటించి సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుసుకున్నారు. గత నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందని కుటుంబాలు ఎక్కడా లేవని, ఇంకా అర్హులై ఉండీ పథకాలు అందని వారికి కూడా సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. తిరువూరు పట్టణంలోని ప్రతి వార్డు సచివాలయ పరిధిలో వలంటీర్ల వద్ద సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారం ఉంటుందని పేర్కొన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు ఇన్‌చార్జి జాకీర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



ఆగిరిపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: మండలంలోని పలువురిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం రాత్రి పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడిన ఆగిరిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కాట్రు ధనశ్రీనివాసరావును పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చిన్న ఆగిరిపల్లి శివారు సింగన్నగూడెంకు చెందిన సాదం శివాజీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ షంసున్ నాగుల్‌మీరా, సాదం గోపీనాథ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వస్ఫ్ బోర్డ్ సభ్యుడు షేక్ సుభాని, చిన్న ఆగిరిపల్లి సర్పంచి రమాదేవి జమదగ్ని పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆస్పత్రి భవనం



మైలవరంలోని ప్రభుత్వ ఆస్పత్రి భవనం

మైలవరం: మైలవరం ప్రభుత్వ కమ్యూనిటీ సర్వజన ఆస్పత్రి భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో తగినన్న గదులు లేక ఇంక్యుబేటర్ వంటి పరికరాలు కూడా అటకెక్కించారు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి రూ. 3కోట్లు కేటాయించడంతో శరవేగంగా పనులు జరిగి ప్రారంభానికి సిద్ధమైంది. మైలవరం మండలంలోని 13 పంచాయతీల పరిధిలో 68 వేల మంది జనాభా ఉన్నారు. ఆయా గ్రామాలకు చెందినవారు వైద్యం కోసం రోజూ 180 నుంచి 200 పైన ఔట్ పేషంట్లు ఆస్పత్రికి వస్తున్నారు. అంతేగాక ఏ సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగినా వైద్య సేవలందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉంటున్నారు. పాత ఆస్పత్రిలో 30 మంది రోగులకే ఇన్ పేషెంట్స్ సౌకర్యం ఉండగా నూతన భవనంలో 50 పడకలకు విస్తరించారు. పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు. అన్ని వ్యాధులకు మందులు కూడా అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

దగ్ధమైన మొక్కజొన్న చేల పరిశీలన



మొక్కజొన్న చేలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 10 ఎకరాల్లో దగ్ధమైన మొక్కజొన్న పంటను సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పటాపంచల జమలయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికొచ్చిన పంట కాలిపోవడం రైతుల్లో తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. రైతులు ఎకరాకు సుమారు రూ.50 వేలు వరకు పెట్టుబడి పెట్టారన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ మలీ్లడి యలమందారావు, నియోజవర్గం కార్యదర్శి బుద్ధి రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



తిరువూరులో ఆదిశంకరాచార్య జయంతి

తిరువూరు: ఆదిశంకరాచార్యుల జయంతి కార్యక్రమాన్ని తిరువూరు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆదిశంకరాచార్య చిత్రపటానికి సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చామర్తి రాంబాబు, పీవీవీజీ బ్రహ్మచారి, సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: స్థానిక శోభనాద్రి వేదశాస్త్ర పాఠశాల వేద విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం ఆది శంకరాచార్యుల జయంతి నిర్వహించారు. ఆది శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది శంకరాచార్యుల చిత్ర పటంతో మేళతాళాల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సూరి శర్మ, వేద గురువులు పాల్గొన్నారు.